# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 252 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శనివారం 9 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై

## డీఎంకే సంచలన నిర్ణయం

## లోక్‌సభ స్పీకర్‌కు కనిమొళి లేఖ

## కుదిరిన టీవీకే- కాంగ్రెస్ పొత్తు

## కాంగ్రెస్‌తో కటీఫ్ చేసుకున్న డీఎంకే

## ఈ మేరకు లోక్‌సభలో తమ సీట్లను మార్చాలని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసిన కనిమొళి

**న్యూఢిల్లీ, మే 8 (నమస్తే ఉదయం)**

తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం జరిగింది. ఇండియా కూటమికి డీఎంకే గుడ్‌బై చెప్పింది. లోక్‌సభలో తాము కూర్చునే సీట్లను మార్చాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను డీఎంకే ఎంపీ కనిమొళి కోరారు. డీఎంకే ఎంపీలకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా తమ ఎంపీలు లోక్‌సభలో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి వీలవుతుందని తెలిపారు. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్‌తో డీఎంకే పార్టీ పొత్తు ముగిసిపోయిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో డీఎంకే ఎంపీలు ఇకపై కాంగ్రెస్ ఎంపీల పక్కనే కూర్చోవడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. తన అభ్యర్థనను స్పీకర్ కార్యాలయం తగిన విధంగా పరిశీలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కనిమొళి లేఖ రాశారు. కాగా, విజయ్ టీవీకే పార్టీ



ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు తెలపింది. దీంతో హస్తం పార్టీ, డీఎంకే సుదీర్ఘ పొత్తు బంధం ముగిసింది.

**కుదిరిన టీవీకే- కాంగ్రెస్ పొత్తు**

దశాబ్దాలుగా రాష్ట్రాన్ని రాజకీయంగా శాసిస్తున్న డీఎంకే, ఏఐఏడీఎంకేల గుత్తాధిపత్యానికి తెరదించుతూ, తన తొలి ఎన్నికల్లోనే విజయ్ నేతృత్వంలోని టీవీకే అదరగొట్టింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 10 సీట్ల దూరంలోనే నిలిచింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఏర్పాటుకు బలం సరిపోకపోవడంతో కాంగ్రెస్ మద్దతును విజయ్ కోరారు. వెంటనే కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. టీవీకే పొత్తు విషయంలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్‌కు ఇచ్చింది. దీంతో టీవీకే- కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరింది.



## తమిళ రాజకీయాల్లో

# మరో ట్విస్ట్..

### విజయ్ ప్రమాణస్వీకారంపై సందిగ్ధత!

**న్యూఢిల్లీ, మే 8 (నమస్తే ఉదయం)**

తమిళనాడు రాజకీయాల్లో మరో ట్విస్ట్..! ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా అనిశ్చితి పూర్తిగా తొలగిపోలేదు. శుక్రవారం సాయంత్రం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసిన టీవీకే చీఫ్ విజయ్ (ఎఆయిఎ).. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరగా.. ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే, లోక్‌భవన్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాకపోవడంతో మళ్లీ అదే సందిగ్ధత కొనసాగుతోంది.

ఇటీవల వెలువడిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు.. తొలుత కాంగ్రెస్, తాజాగా సీపీఐ, సీపీఎంతో పాటు వీసీకే పార్టీలు మద్దతు ప్రకటించడంతో మెజార్టీ మార్కును చేరుకున్నట్లయింది. వీసీకే అధికారికంగా లేఖ ఇవ్వకపోడం ..మిగతా 2లో

## దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ

# కొడంగల్‌కు...

### దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను అభివృద్ధి చేస్తా

### కొడంగల్‌లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### కొడంగల్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ

### కొడంగల్‌లో రాజకీయాలు పక్కనపెట్టి పని చేద్దామని పిలుపు





**కొడంగల్, మే 8 (నమస్తే ఉదయం)**

దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు ..మిగతా 2లో



## ఆగస్టు నాటికి మూసీ పునరుజ్జీవ

# పనులు స్టార్ట్!

2

### మూసీ ప్రాజెక్టుపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

### మూసీ డీపీఆర్ వివరాలను మంత్రులకు అందించిన అధికారులు

### తొలి దశలో చేపట్టే పనులకు ఏడీబీతో చర్చలు ముగిసినట్లు వెల్లడి

## నేడు బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

# ప్రమాణ కార్యక్రమం

### ప్రధాని మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాల హాజరు

### శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక

### అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ

**కోల్‌కతా, మే 8 (నమస్తే ఉదయం)**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని ..మిగతా 2లో



# పాఠశాల విద్యలోకి ఇంటర్....

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం:

### రద్దు కానున్న ఇంటర్ బోర్డు, నేడో రేపో ఆర్డినెన్స్ జారీ

**హైదరాబాద్, మే 8 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది.పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తు మట్నదలు పెట్టింది.జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా స్కూల్ విద్యను 12వ తరగతి వరకు ..మిగతా 2లో

## తెలంగాణలో బీసీ కులాల

# పేర్లు మార్పు

**హైదరాబాద్, మే 8 (నమస్తే ఉదయం)**

తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. సమాజంలో కించపరిచే విధంగా ఉన్న కొన్ని కులాల పేర్లను తొలగించి, వాటి స్థానంలో గౌరవప్రదమైన పేర్లను చేరుస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆయా వర్గాల ఆత్మగౌరవం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ ద్వారా అధికారిక రికార్డుల్లోకి రానున్నాయి.

**బీసీ గ్రూప్-ఏలో విప్లవాత్మక మార్పులు:**

ప్రభుత్వం చేపట్టిన ఈ మార్పుల్లో బీసీ గ్రూప్-ఏ విభాగంలో అత్యధిక మార్పులు జరిగాయి. ముఖ్యంగా ..మిగతా 2లో

# దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు...

**మొదటి పేజీ తరువాయి...**

కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ- వికారాబాద్ రైల్వేలైన్





త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఆగస్టు నాటికి మూసీ పునరుజ్జీవ పనులు స్టార్ట్!

హైదరాబాద్, మే 8 (నమస్తే ఉదయం)

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను ఆగస్టు నాటికి ప్రారంభించాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేర పనులు చేపట్టాలని తెలిపింది. నిర్మాణాలపై ఎక్కువ ప్రభావం లేకుండా అలైన్‌మెంట్‌లు మార్చాలని సూచించింది. ప్రాజెక్టులో భాగంగా మూసీలో పలు చోట్ల టూరిజం స్పాట్లుగా ఆకర్షించేలా రబ్బర్ డ్యాంలను నిర్మించేలా ప్రణాళిక చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై నెలకొన్న అనుమానాలు నివృత్తి చేయాలని, ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు కేబినెట్ సబ్ కమిటీ దిశానిర్దేశం చేసింది.

ప్రజాభవన్‌లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమావేశమై ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనుల క్యాలెండర్‌పై చర్చించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు డీపీఆర్‌ను మంత్రులకు వివరించిన అధికారులు, ఐదు దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

రిటైనింగ్ వాల్స్ : ప్రాజెక్టులో భాగంగా మూసీలో చెత్త తొలగించి శుభ్రపరచడం, రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్, నదికి రెండు వైపులా రోడ్లు, ప్రధాన మురుగు నీటి కాలువలు, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి ఉంటాయన్నారు. సుమారు రూ.7.55 వేల కోట్లతో చేపట్టనున్న మొదటి ఫేజ్ నిధుల సమీకరణపై ఆసియా అభివృద్ధి బ్యాంక్‌తో సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు వివరించారు.

మొదటి ఫేజ్‌లో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేరకు అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ దశలో ఉందని అధికారులు తెలిపారు. ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్లలో వెంటనే పనులను ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మొదటి ఫేజ్ పనులను ఆగస్టు నాటికి ప్రారంభించి, వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకోవాలని మంత్రులు ఆదేశించారు. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్‌ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.


విస్తృతంగా ప్రచారం చేయాలి : పర్యావరణ అనుమతులను తీసుకోవాలని అధికారులకు మంత్రులు చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం భూమిని రక్షణ శాఖ నుంచి తీసుకొనే ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మూసీ పునరుజ్జీవనం వల్ల కలిగే ఉపయోగాలపై నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లపై హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

పురోగతి స్పష్టంగా కనిపించేలా నిర్దేశిత కాలవ్యవధిలో పనుల నిర్మాణం జరగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. సాంకేతికపరమైన అంశాల్లో ఐఐటీ, జేఎన్టీయూ నుంచి తగిన సహకారం తీసుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఆటంకాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

రబ్బర్ డ్యాంల ఏర్పాటు : నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్టులో భాగంగా నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. నీటి నిల్వను పెంచడంతో పాటు జల క్రీడలు, బోటింగ్ సదుపాయాలతో టూరిజం స్పాట్‌లుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక చేసినట్లు అధికారులు వివరించారు. ఒబెర్‌మెయర్ స్పిల్‌వే గేట్ టెక్నాలజీ సంస్థ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు పరిశీలించారు. నాసిక్, ముంబయి నగరాల్లో ఈ సంస్థ నిర్మించిన రబ్బర్ డ్యాంలను అధ్యయనం చేయాలని అధికారులకు మంత్రులు తెలిపారు.

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదని ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదని వారిని భాగస్వాములను చేయడమేనని పేర్కొంది. మూసీ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి విశ్వసనీయత కల్పించేలా కార్యచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది.

జీవన ప్రమాణాలు మెరుగ్గా : ప్రజా ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత తెలిపింది.



## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప

గద్వాల జిల్లా ప్రతినిధి,మే8(నమస్తే ఉదయం)

కేటీదొడ్డి మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప శుక్రవారం తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డితో కలిసి ఆయన దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలర్లు విధిగా నిబంధనలు పాటించాలని, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవడానికి నానో ఎరువుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. నానో ఎరువుల వల్ల ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వివరించారు. అధికారులు సిఫారసు చేసిన మోతాదులోనే వీటిని వాడాలని ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది మరియు డీలర్లు పాల్గొన్నారు.

## తమిళ రాజకీయాల్లో మరో ట్విస్ట్..

**మొదటి పేజీ తరువాయి...**

వల్లే ఈ సందిగ్ధత నెలకొన్నట్లు సమాచారం. అయితే, తాజా పరిణామాలపై స్పందించిన వీసీకే.. విజయ్‌కు మద్దతుపై క్లారిటీ ఇచ్చింది. ఇప్పటికే ఈ–మెయిల్‌లో లేఖ పంపామని.. శనివారం అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు ‘ఎక్స్’లో పోస్టు చేసింది.

**విజయ్ ప్రమాణస్వీకారం ఎప్పుడు?**

మరోవైపు, శనివారం (మే 9న) ఉదయం 11గంటలకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేస్తారని సీపీఎం నేత కె.బాలకృష్ణన్ వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం ఎప్పుడు ఉంటుందనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

**వామపక్షాలకు విజయ్ థాంక్స్**

గవర్నర్‌తో సమావేశం ముగిసిన వెంటనే విజయ్ నేరుగా చెన్నైలోని సీపీఐ, సీపీఎం కార్యాలయాలకు వెళ్లారు. తనకు మద్దతు ప్రకటించిన ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలకు కృతజ్ఞతలు చెప్పారు. మరోవైపు, ఇప్పటికే టీవీకేకు కాంగ్రెస్‌తో పాటు సీపీఎం, సీపీఐ మద్దతు తెలిపాయి.

**బయటి నుంచే మద్దతు.. మంత్రివర్గంలో చేరం: లెఫ్ట్**

టీవీకేకు బయట నుంచే తాము మద్దతిస్తామని.. ప్రభుత్వంలో చేరబోమని సీపీఎం నేత యు.వాసుకి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. “సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు ఈ రోజు సమావేశమయ్యాయి. టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు బయటి నుంచే మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాయి. తెలిపారు.

## తెలంగాణలో బీసీ కులాల పేర్లు మార్పు

**మొదటి పేజీ తరువాయి...**

వినడానికి అసభ్యకరంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు.

దొమ్మర: ఈ పేరును తొలగించి ‘గడ వంశీయ’గా మార్చారు.

పిచ్చకుంట్ల: ఇకపై ఈ కులస్తులను ‘వంశ రాజ్’గా వ్యవహరిస్తారు.

బుడబుక్కల: వీరికి ‘శివ క్షత్రియ’ అనే గౌరవప్రదమైన పదాన్ని జోడించారు.

వీరభద్రియ: వీరి కోరిక మేరకు ‘వీరముష్టి, నెట్టి కోటల’ అనే పదాలను పర్యాయపదాలుగా చేర్చారు.

వన్నార్: ఈ పదాన్ని తొలగించి, రజక/చాకలి వర్గాల కోసం ‘ధోబీ’ అనే పదాన్ని ఖరారు చేశారు.

గ్రూప్–డిలో ‘శూద్ర’ పదం తొలగింపు.

బీసీ గ్రూప్–డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న ‘శూద్ర కులం’ అనే పదాన్ని అధికారిక రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు. ఆ స్థానంలో ‘తమ్మలి (బ్రాహ్మణేతర)’గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆ వర్గానికి స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న ‘మేర’, ‘చిప్పోలు‘ కులాలకు అదనంగా ‘మేరు’ అనే పదాన్ని చేర్చారు.

# నేడు బెంగాల్ సిఎంగా సువేందు అధికారి ప్రమాణ కార్యక్రమం

**మొదటి పేజీ తరువాయి...**

బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి ’జెయింట్ కిల్లర్’గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు.

# పాఠశాల విద్యలోకి ఇంటర్....

**మొదటి పేజీ తరువాయి...**

ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 100 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి 2026–27 విద్యాసంవత్సరం నుంచే 11 తరగతి బోధన ప్రారంభిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కొత్త విద్యావిధానం అమలులోకి వస్తే పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇకపై జూనియర్ కాలేజీలకు వెళ్లకుండా అదే పాఠశాలలో 11 వ తరగతి(ప్లస్ టూ ఎడ్యుకేషన్ సిస్టమ్)చదవనున్నారు. ఈ విధానం సక్సెస్ అయితే తెలంగాణలో పాఠశాల, ఇంటర్ విద్యకు ఒకే బోర్డు ఏర్పడనుంది.ఇంకా చెప్పాలంటే ఇంటర్ బోర్డు విలీనం కానుంది అని తెలుస్తోంది. ఇకపోతే రాష్ట్రంలో ప్లస్ టూ విద్యావిధానం అమలుకు సంబంధించి అవసరమైన మార్గదర్శకాలను సిద్ధం చేయాలని విద్యాశాఖ మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

తెలంగాణలో ఇంటర్ విద్య పాఠశాల విద్యలోకి విలీనం కానుంది. ఇంటర్‌ను పాఠశాల విద్యలోకి విలీనం చేస్తే ఇంటర్ బోర్డు రద్దు అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపై పాఠశాల, ఇంటర్ విద్యకు ఒకటే పరీక్షల బోర్డు ఉండే అవకాశం ఉది. నూతన విద్యాసంవత్సరం (2026–27) మరికొన్ని రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ విలీనంపై తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. అటు ఎస్ఎస్‌సీ బోర్డు ఇటు ఇంటర్ బోర్డు రెండింటికి వేర్వేరు చట్టాలున్న కారణంగా వాటిని సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడో రేపో ఆర్డినెన్స్ జారీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యాశాఖ ఇన్‌ఛార్జి సెక్రటరీ శ్రీదేవసేన సమక్షంలో పాఠశాల, ఇంటర్ విద్యాశాఖ అధికారులు , సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉమ్మడి బోర్డుకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (టీజీఎస్ఈబీ)గా నామకరణం చేస్తామని డిసెంబరులో విడుదల చేసినటువంటి రైజింగ్ తెలంగాణ దార్శనిక డాక్యుమెంట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసిన అంశంపై మరోసారి చర్చించారు.బి

పాఠశాల విద్యలోకి ఇంటర్ విద్యను విలీనం చేయాలంటే ఆ రెండు చట్టాలను కలిపి ఒక కొత్త చట్టాన్ని రూపొందించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా పాఠశాల విద్యకు సంబంధించి తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్టు (1982) సవరించాల్సి ఉంది. అలాగే ఇటర్ విద్యకు సంబంధించి తెలంగాణ ఇంటర్‌మీడియట్ విద్యా చట్టాన్ని (1971) రద్దు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం విలీన ప్రక్రియపై కసరత్తు జరుగుతున్న తరుణంలో ప్రభుత్వ పరీక్షల విభాగం (ఎస్ఎస్‌సీ బోర్డు), ఇంటర్‌మీడియట్ విద్యామండలి (ఇంటర్‌బోర్డు)ని కలిపి ఒకే ఉమ్మడి బోర్డును ఏర్పాటు చేసే అవకాశం ఉంది.అటు కేంద్ర విద్యాశాఖ సైతం ప్రతి రాష్ట్రంలో పది, ఇంటర్‌కు ఒకే బోర్డు ఉండాలని సూచించిన సంగతి తెలిసిందే.

# మహిళల రక్షణే ధ్యేయం.. వారం రోజుల్లో 32 మంది ఆకతాయిల అరెస్ట్

## సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ పనితీరుపై డిసిపి కె. సృజన

శేరిలింగంపల్లి : మే 8, (నమస్తే ఉదయం)

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సైబరాబాద్ పోలీసులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని గత వారం రోజుల్లో షీ టీమ్స్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు సాధించిన పురోగతిని సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డిసిపి కె. సృజన వివరించారు. బాధిత మహిళ ఫిర్యాదు ఆధారంగా షీ టీమ్ మెరుపు దాడులు చేసి 32 మంది పట్టుకున్నట్లు. వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధిస్తున్న ఆకతాయిలపై షీ టీమ్స్ నిఘా పెంచిందని వారం రోజుల్లో నిర్వహించిన 99 డెకాయ్ ఆపరేషన్లలో అసభ్యంగా ప్రవర్తిస్తున్న 32 మందిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నమన్నారు. వీరిపై 42 పెట్టీ కేసులు నమోదు చేసి మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. వివిధ మార్గాల ద్వారా బాధితుల నుండి అందిన 17 ఫిర్యాదులపై తక్షణమే స్పందించినట్లు డిసిపి తెలిపారు. మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. వ్యభిచార నిర్మూలన కేసుల్లో ముగ్గురు బాధితులను రక్షించి, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని వివరించారు. జువైనల్ జస్టిస్ యాక్ట్ కింద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని నలుగురు బాలురను రక్షించినట్లు పేర్కొన్నారు. కుటుంబ కలహాలతో విడిపోయిన భార్యాభర్తలను కలిపేందుకు సిడిఈడబ్ల్యూ కేంద్రాలు కృషి చేస్తున్నాయని వారంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా 33 కుటుంబాలను షీ టీమ్స్ విజయవంతంగా తిరిగి కలిపాయని చెప్పారు. సైబరాబాద్ వ్యాప్తంగా 1,685 మందికి వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, సైబర్ బుల్లీయింగ్, సోషల్ మీడియా వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సమావేశంలో సూచించారు. అత్యవసర సమయాల్లో 100, 181, 1098, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను ఉపయోగించుకోవాలని పోలీసులు కోరారు. మహిళా భద్రతలో భాగంగా మదాపూర్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ‘మహిళా భద్రతా వేదిక’ ఎస్సీ ఎస్సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రత్యక్షంగా, వర్చువల్ గా కలిపి 300 మందికి పైగా ఉద్యోగులు హాజరయ్యారు.





షీ టీం నిర్వహించిన అవగాహన కార్యక్రమం..

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,మే08(నమస్తే ఉదయం)**

నూతన వధూవరులు నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలు వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.వివాహ శుభకార్యాలకు కార్తీక్ రెడ్డితో కలిసి వివాహ శుభకార్యములకు కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం ఆనందంగా,ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.





# ప్రధానమంత్రి సభ విజయవంతం కావాలని పూజలు






శివరాంపల్లి శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు


**బుద్వేల్, మే 8 (నమస్తే ఉదయం)**

ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభ విజయవంతం కావాలని శుక్రవారం శివరాంపల్లి శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో బీజేపీ నాయకులు పూజలు చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గడీల పద్మావతి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. మూడవ సారి ప్రధానమంత్రి అయిన తర్వాత నరేంద్రమోడీ మొదటి సారిగా హైదరాబాద్ నగరానికి వస్తున్నారని, ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. మోడీ బహిరంగ సభ కు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ ఇంచార్జి వై శ్రీధర్, రాజేం ద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పసుపుల సందీప్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సదాల రాజశేఖర్ రెడ్డి, హరి కిషన్ జి, సరితారెడ్డి, క్రిష్ణవేణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం, క్రమశిక్షణలే వ్యక్తికి ప్రధానం







**జస్టిస్ ఈద తిరుమలాదేవి**

**విశ్వవిద్యాలయాలు విజ్ఞాన పరివర్తన కేంద్రాలు : వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య**

**ఘనంగా రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల 80వ వార్షికోత్సవాలు**

**బుద్వేల్, మే 8 (నమస్తే ఉదయం)**

మానవత్వం, క్రమశిక్షణ లే వ్యక్తికి ప్రధానమని విద్యార్థిగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనే ఆ విలువలు నేర్చుకున్నానని, హై కోర్టు న్యాయమూర్తి జస్టీస్ ఈద తిరుమలాదేవి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల 80వ వార్షికోత్సవం శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జస్టీస్ ఈద తిరుమలాదేవి మాట్లాడుతూ, 40 సం వత్సరాల క్రితం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆనాడు హోమ్ సైన్స్ గా పిలువబడే నేటి కమ్యూనిటీ సైన్స్ లో బీఎస్సీ, ఎంఎస్సీ చదివానని ఆమె తెలిపారు. తాను ప్రస్తుతం ఎంత ఉన్నత స్థానంలో ఉన్నప్పటికి విశ్వవిద్యాలయంలో నేర్చుకున్న విలువలే తనను నడిపిస్తున్నాయన్నారు. హోమ్ సైన్స్ కోర్సులో పౌష్టికాహారం, వంటలు, టెక్స్ టైల్స్ వంటి కీలక అంశాలు బోదించేవారన్నారు. నేటి కాలంలో శారీరక సౌష్టవం, ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపధ్యంలో ఆ కోర్సుల ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. వృద్ధుల కోసం వెల్ నెస్ సెంటర్ ను ప్రారంభించడం వంటి మంచి కార్యక్రమాలు చేపట్టిన వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అలాస్ జానయ్య ను జస్టీస్ ఈద తిరుమలాదేవి అభినందించారు. మొబైల్ ఫోన్ల కారణంగా ప్రపంచం మనిషి చేతిలోకి వచ్చిన ఈ కాలంలో మానవత్వం, క్రమశిక్షణ కలిగిన మంచి వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాలు విజ్ఞాన పరివర్తన సంస్కరణ కేంద్రాలన్నారు. ముగ్గురు ప్రధాన మంత్రు లు, ఒక ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభమైన వ్యవసాయ విశ్వ విద్యాలయం అనేక రంగాలకు ప్రముఖులను అందించిందన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని, కొన్ని నిర్ణయాలు కఠినంగా అనిపించినా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్నవేనన్నారు. ప్రతి వ్యక్తి తన జీవితానికి తానే బాధ్యుడని, సవాళ్లను సానుకూల దృక్పతంతో స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. కరెంటు లేని గ్రామంలో 10వ తరగతి వరకు చదివి పట్టుదలతో ఈ స్థాయికి చేరుకున్నానని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. సాకులు చూపకుండ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులు ఏడాది లోపు తెలుగు నేర్చుకోవాలని, ఎక్కువ భాషలు నేర్చుకోవడం మంచిదన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి నరేందర్ రెడ్డి కళాశాల ప్రగతి నివేధికను సమర్పించారు. బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు తమ కళాశాల అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ మ్యాగజైన్, సీడీ ని అతిధులు ఆవిష్కరించారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులను, అతిధులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీరాణి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆఫైర్స్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ కె బి ఈశ్వరి, కళాశాల ఓఎస్ఏ వి. రామిరెడ్డి లు పాల్గొన్నారు.





# మ్యూల్ అకౌంట్లకు చెక్ పెట్టండి.. సైబర్ దర్యాప్తులో బ్యాంకుల సహకారం కీలకం!

**సైబరాబాద్‌లో రూ. 438 కోట్ల దోపిడీ!**

**బ్యాంకర్లతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించిన సీపీ డా. ఎం. రమేష్**

**ప్రతి బ్యాంకులో ప్రత్యేక 'సైబర్ సెల్స్' ఏర్పాటుకు ఆదేశం**

**శేరిలింగంపల్లి ,మే 8, (నమస్తే ఉదయం)**





సైబర్ నేరాలు సమాజానికి పెను సవాలుగా మారాయని వీటిని అరికట్టడంలో పోలీసులతో పాటు బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ స్పష్టం చేశారు. మ్యూల్ అకౌంట్ల నియంత్రణ బాధితులకు నగదు వాపసు, దర్యాప్తులో వేగం పెంచడంపై సైబరాబాద్ కమిషనరేట్ లో వివిధ బ్యాంకుల ప్రతినిధులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆన్‌లైన్ స్కామ్‌లు క్రిప్టో మోసాలు నకిలీ పెట్టుబడి పథకాలతో ప్రజలు తమ జీవితకాల పొదుపును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2025లో సైబరాబాద్ పరిధిలో రూ438 కోట్లు బాధితులు కోల్పోయారని వివరించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు కేవలం ఐదు నెలల్లోనే రూ. 104 కోట్ల మేర మోసం జరిగిందని వివరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నప్పటికీ, నేరగాళ్లు కొత్త పంథాల్లో మోసాలకు పాల్పడుతున్నారని దీనికి అడ్డుకట్ట వేయాలంటే బ్యాంకింగ్ డేటా భద్రత పటిష్టంగా ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల ఫిర్యాదులపై తక్షణమే స్పందించేందుకు ప్రతి బ్యాంకులో కేంద్రీకృత సైబర్ సెల్స్ తోపాటు అప్‌డేటెడ్ నోడల్ ఆఫీసర్లతో కూడిన విభాగం ఉండాలని సూచించారు. ప్రతి బ్యాంకు లో సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్ ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. మ్యూల్ అకౌంట్లను (ఇతరుల పేరుతో ఉండే ఖాతాలు) గుర్తించి నియంత్రించడం ద్వారా నేరగాళ్ల నెట్‌వర్క్‌ను దెబ్బతీయవచ్చొన్నారు. సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి మనోహర్ మాట్లాడుతూ బ్యాంకుల నుండి కేవైసీ పత్రాలు ఖాతా వివరాలు అందడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల నిందితులు తప్పించుకుంటున్నారని తెలిపారు. ఖాతాను ఫ్రీజ్ చేసిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. సీఎస్‌బీ ఎస్పీ సాయిశ్రీ మాట్లాడుతూ ఎన్‌సీఆర్‌బీ డాటాను విశ్లేషించి కార్పొరేట్ ఖాతాల రిలేషన్ షిప్ మేనేజర్ల వివరాలను పోలీసులతో పంచుకోవాలని కోరారు. బ్యాంక్ సిబ్బందికి సైబర్ నేరాల ప్రక్రియలపై ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు.

**ప్రజలకు విజ్ఞప్తి**


పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని సీపీ కోరారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీసీపీలు కోటి రెడ్డి, ఏ. ముత్యం రెడ్డి, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్ వంటి ప్రముఖ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



## నేడు మైలార్ దేవుపల్లి సెక్షన్లో విద్యుత్ సరఫరాల అంతరాయం

**రాజేంద్రనగర్ మే 8(నమస్తే ఉదయం)**

విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. మైలార్ దేవ్ పల్లి గ్రామ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుండి 11.30 వరకు మైలర్ దేవ్ పల్లి గ్రామం, ప్రగతి కాలనీ, మొఘల్ కాలనీ, బృహదావన్ కాలనీ, టాటా నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.




## ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి, మే 8 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గతంలో పాదయాత్ర చేసినప్పుడు రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను తొలగించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. అదే విషయన్ని శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి, అధికారులతో మాట్లాడి పీజేఆర్ నగర్ కాలనీ లో ఉన్న చెత్త, మట్టిని తొలగించడం జరుగుతుందని వెంకటేష్ గౌడ్ తెలియచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా అన్ని కాలనీలలోని రోడ్లపై ఉన్న చెత్త, మట్టిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలలో గాని, రోడ్లమీద గాని, చెరువులలో గాని వేయవొద్దని ప్రజలకు తెలియచేసారు. జిహెచ్ఎంసి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి చెత్తను రోడ్లమీద వేయకుండా ప్రజలలో అవగాహన తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, ఎస్.ఎఫ్.ఎ మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ద

## ఫిట్స్‌తో ఏడు నెలల గర్భిణి మృతి

**బుద్వేల్, మే 8 (నమస్తే ఉదయం)**



మృతి చెందిన వాణి రెడ్డి


ఏడు నెలల గర్భిణీ కి ఫిట్స్ వచ్చి క్రింద పడిపోవడంతో గాయాలకు గురై మరణించింది. ఈ సంఘటన గురువారం రాత్రి రాజేంద్రనగర్ పోలీస్టేషన్ పరిధిలోని బవానీ కాలనీ లో జరిగింది. ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్, ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఈ విదం గా ఉన్నాయి.... తిరుపతి కి చెందిన జ్యోతికుమార్ రెడ్డి, వాణిరెడ్డి (32)లు భార్యభర్తలు. మూడు సం వత్సరాల క్రితం వీరికి వివిహం జరిగింది. జ్యోతి కుమార్ రెడ్డి ప్రైవేటు ఉద్యోగి గా పనిచేస్తున్నాడు. వీరికి పద్నాలుగు నెలల పాప ఉంది. వాణి రెడ్డి ఏడు నెలల గర్భిణి. గురువారం రాత్రి వాణిరెడ్డి కి ఫిట్స్ వచ్చి క్రింద పడిపోయింది. గమనించిన భర్త జ్యోతి కుమార్ రెడ్డి వెంటనే ఇంటి యజమాని తో కలసి వాణిరెడ్డిని శివరాంపల్లి లో గల ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే వాణిరెడ్డి మరణించారని వైద్యులు ధృవీకరించారు. కుమార్తె మరణవార్త గురించి తెలుసుకున్న వాణిరెడ్డి తల్లిదండ్రులు, సోదరులు బవానీకాలనికి చేరుకున్నారు. తమ కుమార్తె మరణం పై ఎలాంటి అనుమానాలు లేవని ఆమె తల్లి తాటిరెడ్డి పుష్ప పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న జస్టిస్ ఈద తిరుమలాదేవి, డీ ఎస్ ఎ డాక్టర్ సీ హెచ్ వేణుగోపాల్ రెడ్డి లు. చిత్రంలో వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తదితరులుసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

## వధువరులను ఆశీర్వదించిన వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు,

# మధనపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మూలమల్ల భీంరెడ్డి






**కొత్తకోట, మే 8(నమస్తే ఉదయం)**

మండలం లోని పామాపురం గ్రామానికి చెందిన ఆరెపల్లి బీచుపల్లి కుమారుడు విజయ్ కుమార్ , క్రిష్ణవేణి ల వివాహ వేడుకల్లో వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు, మధనపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మూలమల్ల భీం రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో యల్ఐసి మన్యం,మాజీ ఎంపీటీసీ సభ్యులు లక్ష్మి గోవిందు నాయుడు, బోయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరంకొత్తకోట ఆనంద్ కన్వెన్షన్ లో అపరాల గ్రామానికి చెందిన గొల్ల పెద్ద మొగులన్న, పార్వతమ్మ దంపతుల కుమారుడు వినోద్ కుమార్, మీనాక్షి వివాహంలో పాల్గొన్న వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి గ్రామ సర్పంచి శ్రీనివాసులు,మూలమల్ల యుగంధర్ రెడ్డి, జి భారతయ్యా, కృష్ణ శివప్రసాద్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.




## విద్యా వారోత్సవాలను

# విజయవంతం చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 8(నమస్తే ఉదయం)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వారోత్సవాల కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం సాయంత్రం ఐడిఓసి సమావేశపు మందిరంలో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. వారం రోజుల కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు ఇప్పటికే విధి విధానాలు వచ్చినందున దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఆయా విద్యాసంస్థల్లో మౌలిక వసతుల నిర్మాణానికి నిధులు వచ్చినందున శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యాశాఖ కార్యక్రమాల గురించి తెలియజేయాలన్నారు. పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ముఖ్యమైన సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదవ తరగతి, ఇంటర్ లో టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయాలన్నారు. బడిబాట కార్యక్రమంతో పాటు ఇతర కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఐఈఓ హృదయ రాజు, డీఈవో విజయలక్ష్మి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## అమ్మవారి కృపతో ప్రజలందరూ

# సుఖసంతోషాలతో ఉండాలి

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**కొర్లకుంట చిత్తారమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్**

**పటాన్ చెరు,మే 8 (నమస్తే ఉదయం):**

అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొర్లకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించి నూతన దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు , సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ప్రకాశ్ చారి, నరసింహ, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన వేళ సైబరాబాద్‌లో

## 'నో ఫ్లై జోన్'.. డ్రోన్లపై నిషేధం!

**శేరిలింగంపల్లి ,మే 8, (నమస్తే ఉదయం)**



సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్

భారత ప్రధానమంత్రి మే 10వ తేదీన హైదరాబాద్ నగరంతో పాటు మాదాపూర్ లో పర్యటించనున్నారు. హైటెక్ సిటీలో నూతనంగా నిర్మించిన సింధు హాస్పిటల్‌ను ప్రారంభించడంతో పాటు పలు ఇతర కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొంటారు. ప్రధాని పర్యటన దృష్ట్యా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ కీలక ఆదేశాలు జారీ చేశారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 కింద తనకు ఉన్న అధికారాలను వినియోగిస్తూ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గగనతలంలో ఎటువంటి వస్తువులను ఎగురవేయకూడదని నిషేధాజ్ఞలు విధించారు. రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు ఏ సామర్థ్యమైనా, పారా గ్లైడర్లు రిమోట్ కంట్రోల్డ్ మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఎగుర వేయరాదు. ఈ నిషేధాజ్ఞలు మే 10 రోజంతా అమల్లో ఉంటాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే, చట్టపరమైన నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



## బాల్య వివాహాల నిర్మూలనపై

# అవగాహన కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 8(నమస్తే ఉదయం)**

గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాల పరిరక్షణ విభాగాధికారి పద్మ అన్నారు. శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేటిదొడ్డి మండలం పూజారి తండా గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయి 21 సంవత్సరాలు వచ్చేవరకు చదివించాలని అంతకన్నా ముందు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని, అందుకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు లక్ష రూపాయల జరిమానం ఉ ంటుందనిఅన్నారు. పిల్లలకు ఎలాంటి సమస్యలున్నా 1098కి లేదా 100 నెంబర్ కు సమాచారం అందించాలని తెలియజేశారు. బాలికల్ని రక్షిద్దాం చదివిద్దాం, సుకన్య సమృద్ధి యోజన పథకం తల్లిదండ్రుల ఆర్థిక పొదుపు పథకంగా పుట్టినప్పటి నుండి పది సంవత్సరాల లోపు ఆడపిల్ల పేరుపై పోస్ట్ ఆఫీస్ లో అకౌంట్ ఓపెన్ చేయించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రా జూనాయక్, డి హెచ్ ఈ డబ్ల్యూ సరోజ, చైల్డ్ హెల్ప్ లైన్ సరాగిణి, ఫీల్డ్ అసిస్టెంట్ దీప్లా నాయక్ మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్ (రెవిన్యూ)గా బాధ్యతలు

# స్వీకరించిన మధు మోహన్

**గద్వాల జిల్లా ప్రతినిధి,మే8(నమస్తే ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) గా సి.హెచ్. మధు మోహన్ శుక్రవారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధు మోహన్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం వివిధ శాఖల పలువురు అధికారులు అదనపు కలెక్టర్ కు పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు.

## అదుపుతప్పి చెట్టు ఢీకొన్న కారు...

# నలుగురికి గాయాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,మే8(నమస్తే ఉదయం)**



గద్వాల మండలం గోనుపాడు గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మద్యాహ్నం చోటు చేసుకుంది. కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన ప్రకాష్ కుటుంబ సభ్యులు శుక్రవారం కొండాపురం గ్రామంలో శు భాకార్యం ముగించుకుని కుటుంబ సభ్యులతో కలిసి కారులో గద్వాలకు బయలుదేరారు. కారు నడుపుతున్న సమయంలో ప్రకాష్ కు నిద్ర రావడంతో గద్వాల మండలం గోనుపాడు గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారు నడుపుతున్న ప్రకాష్ కు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న మిగతా వారికి స్వల్ప గాయాల య్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# ప్రజాహితమే నా జీవితాశయం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## శంషాబాద్‌లో రూ.597.44 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





శంషాబాద్ లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రకాశం గౌడ్

**శంషాబాద్,మే08(నమస్తే ఉదయం)**

ప్రజల ఇతనే నా జీవితాశయం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ సర్కిల్-18లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.వార్డు నెంబర్ 119,కొత్వాల్‌గూడలోని సహస్ర శ్రీనివాస ఎన్క్లేవ్,శంషాబాద్ డివిజన్ గండిగూడ,ఆటోనగర్ లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పునాది రాయి వేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...ప్రజలకు మెరుగైన రవాణా అందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ,ఎస్సీ కిష్టప్ప,జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు,స్థానిక నాయకులు ఆర్ గణేష్ గుప్తా,వెంకటేష్ గౌడ్,గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733